
కుత్బుల్లాపూర్‌లో అమ్మవారికి బోనం సమర్పించేందుకు వెళ్తున్న మహిళలు


ఫిరోజ్‌గూడ నల్లపోచమ్మ వేడుకల్లో ఎమ్మెల్యే కృష్ణారావుతో కార్పొరేటర్ రవీందర్‌రెడ్డి, ఎడ్ల ప్రభాకర్ తదితరులు


ఓల్డ్‌బోయినపల్లి పోచమ్మ ఆలయంలో కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్‌తో బీఆర్‌ఎస్ నాయకులు


భరత్‌నగర్ పోచమ్మ బోనాల వేడుకల్లో కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు పట్లోళ్ల నాగిరెడ్డి, నాయకులు

# అమ్మా బైలెల్లినాదో..



**(జోన్‌బృందం, ఆంధ్రజ్యోతి)**
శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్ నియోజకవర్గాల్లో ఆషాఢ మాస బోనాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. డప్పుచప్పుళ్లు, అమ్మవారి పాటలతో హోరెత్తాయి. కాలనీలు, బస్తీల్లో ఆధ్యాత్మిక శోభ నెలకొంది. సూర్యోదయానికి ముందే మహిళలు బోనాలు నెత్తిన పెట్టుకుని డప్పుచప్పుళ్ల మధ్య ఆలయాలకు వెళ్లి మొక్కులు చెల్లించుకున్నారు. బోనం సమర్పించేందుకు మహిళలు, యువతులు, చిన్నారులు సాంప్రదాయ దస్తులు దరించి ఆలయాలకు వెళ్లారు. శివసత్తులు, పోతరాజుల విన్యాసాలు అలరించాయి. ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు, ప్రముఖ నాయకులు ఆలయాలను సందర్శించారు. యువతీ, యువకులు సెల్ఫీలు, ఫొటోలు దిగి సందడి చేశారు. అమ్మవారి ఆలయాలను విద్యుత్ దీపాలతో సర్వాంగసుందరంగా అలంకరించారు.


బాలానగర్ పోచమ్మ ఆలయంలో మహిళా కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి కొండకింది పుష్పారెడ్డి


కూకట్‌పల్లిలో అమ్మవారికి దండం పెట్టుకుంటున్న ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, నాయకులు


కుత్బుల్లాపూర్‌లో బోనాల వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్


శివసత్తులతో అమ్మవారికి మొక్కులు చెల్లించుకుంటున్న భక్తుడు


ఫిరోజ్‌గూడలో ఫలహారబండితో నాయకులు


నల్లగండ్లలోని తుల్జాభవానీఅమ్మవారి ఆలయంలో ఎంపీ కొండా విశ్వేశ్వరరెడ్డి, రాష్ట్ర నాయకుడు రవికుమార్‌యాదవ్


బోనాల వేడుకల్లో కుటుంబ సమేతంగా పాల్గొన్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ


కూకట్‌పల్లిలో ఘటంతో చిన్నారి



## రోడ్ల నిర్వహణపై ఫిర్యాదు చేయండి

**కేపీహెచ్‌బీకాలనీ, జూలై 28 (ఆంధ్రజ్యోతి):** కూకట్‌పల్లి, మూసాపేట్, కుత్బుల్లాపూర్, గాజులరామారం, అల్వాల్ సర్కిళ్ల పరిధిలో సీఆర్‌ఎంపీ కింద 44 రహదారులున్నాయని, వాటి నిర్వహణలో ఏ సమస్య ఉన్నా ప్రజలు ఫోన్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చని జడ్సీ అపూర్వ చౌహాన్ ఆదివారం తెలిపారు. సీఆర్‌ఎంపీ (కాంప్రెన్సివ్ రోడ్ మెయింటనెన్స్ ప్రోగ్రాం) పనితీరుపై ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్నామని తెలిపారు. సీఆర్‌ఎంపీ ఏజెన్సీ కాంట్రాక్ట్ ఈ ఏడాది చివరినాటికి ముగియనుండటంతో పెండింగ్‌లో ఉన్న పనులను చేయించుకోవాలని ఇప్పటికే ఎస్‌ఈ, ఈఈ, డీఈ, ఏఈలకు జడ్సీ సూచించారు. ఆయా మార్గాల్లో ఏమైనా సమస్యలు ఉంటే ప్రజలు 24/7 సమయంలో ఈ 967626 5050లో ఫిర్యాదు చేస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. రోడ్లపై గుంతలు, నీరు నిల్వడం, చెత్తా చెదారం పేరుకుపోవడం, ఫుట్‌పాత్ నిర్వహణ ఇలా సమస్య ఏదైనా ఫోన్‌లో సమాచారం అందించాలని తెలిపారు.


హెపటైటిస్ డే సందర్భంగా కేర్ ఆస్పత్రిలో అవగాహన కార్యక్రమం

## కేర్ ఆస్పత్రిలో ఫిట్‌నెస్ అవేర్‌నెస్

**రాయదుర్గం, జూలై 28 (ఆంధ్రజ్యోతి):** గచ్చిబౌలిలోని కేర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో హెపటైటిస్ డే సందర్భంగా ఫిట్‌నెస్ అవేర్‌నెస్ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. వ్యాయామంతో చిన్నచిన్న ఆరోగ్య సమస్యలు దరిచేరవన్నారు. హెపటైటిస్‌పై ప్రజలకు అవగాహన కల్పించేందుకు గచ్చిబౌలిలోని కేర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో దివ్యశ్రీ ఎన్‌ఎస్‌ఎల్ ఓరియల్‌లో జుంబా హెల్త్ అవేర్‌నెస్ సెషన్‌పై కార్యక్రమం నిర్వహించారు. ప్రజలు హెపటైటిస్‌పై అవగాహన కలిగి ఉండాలని కేర్ ఆస్పత్రి వైద్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో డెలైట్, యాక్సెంచర్, జెన్‌ప్యాక్ట్, వెల్స్‌పార్గో కార్పొరేట్ కంపెనీలకు చెందిన యువతీ, యువకులు పాల్గొన్నారు. మైహోం భుజా, ల్యాంకోహిల్స్ కమ్యూనిటీవాసులతో పాటు అనాథాశ్రమాలకు చెందిన పిల్లలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రాయల్ కళాశాల ఆఫ్ ఫిజీషియన్ ఐర్లాండ్‌కు చెందిన ఎంఎస్ జనరల్ సర్జన్ ఐశ్వర్యతో పాటు కేర్ ఆస్పత్రి చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ సనీత అగర్వాల్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య

## కులగణన తర్వాతే స్థానిక ఎన్నికలు నిర్వహించాలి

**బర్కత్‌పుర, జూలై 28 (ఆంధ్రజ్యోతి):** కులగణన చేపట్టి, పూర్తి చేసిన తరువాతనే రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని ఎంపీ ఆర్ కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో బీసీ ఫ్రంట్ చైర్మన్ గొరిగె మల్లేష్ యాదవ్ ఆధ్వర్యంలో 14 బీసీ సంఘాలు, 22 బీసీ కుల ఉద్యోగ సంఘాల సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆర్ కృష్ణయ్య మాట్లాడుతూ, గత కేసీఆర్ ప్రభుత్వం స్థానిక సంస్థలలో బీసీ రిజర్వేషన్లను 20శాతానికి కుదించిందని ఆరోపించారు. రాష్ట్రంలో కులగణన చేపట్టడానికి న్యాయపరమైన అడ్డంకులు ఏమీ లేవన్నారు. కులగణన చేపట్టకుండా, రిజర్వేషన్ల శాతాన్ని పెంచకుండా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కుట్రలు చేస్తుందని, దీనిని తీవ్రంగా ఎదుర్కొంటామని ఆయన హెచ్చరించారు. కామారెడ్డి డిక్లరేషన్‌ను ఖచ్చితంగా అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో బీసీ సంఘాల నేతలు ఎర్ర సత్యనారాయణ, సి. రాజేందర్, జిల్లపల్లి అంజి, బిల్లా దీపిక, పగిళ్ల సతీష్, మోది రాందేవ్, మట్టా జయంతిగౌడ్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

## కబ్జాల నుంచి ఎర్రకుంట చెరువును కాపాడాలి

### నిజాంపేట కార్పొరేషన్ బీజేపీ మాజీ అధ్యక్షుడు సతీష్

**నిజాంపేట్, జూలై 28(ఆంధ్రజ్యోతి):** నిజాంపేట్ కార్పొరేషన్ ప్రగతినగర్ ప్రాంతంలోని సర్వేనెంబరు 134లో 3 ఎకరాల 3 గుంటల విస్తీర్ణంలో ఉన్న ఎర్రకుంట చెరువు కబ్జాకు గురవుతోందని, చెరువు స్థలాన్ని కాపాడాలని స్థానికులతో కలిసి కార్పొరేషన్ బీజేపీ మాజీ అధ్యక్షుడు ఆకుల సతీష్ చెరువు వద్ద ఆదివారం ఆందోళన చేపట్టారు. కొందరు ఆక్రమణదారులు చెరువు స్థలాన్ని ఆక్రమించి, అక్రమంగా అనుమతులు తీసుకుని నిర్మాణాలు చేపడుతున్నారని, చెరువు స్థలం పూర్తిగా ఆక్రమణకు గురైందని, కలెక్టర్ దీనిపై దృష్టి సారించి కబ్జాల నుంచి చెరువును కాపాడాలని ఆయన కోరారు. ఈ విషయంపై అన్ని శాఖల అధికారులకు ఫిర్యాదు చేసినా ఏ అధికారి పట్టించుకోవడం లేదని ఆయన వాపోయారు. చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌ల్లో వేరే సర్వే నంబర్‌తో తహసీల్దార్ ఎన్‌ఓసీ ఇచ్చిన విషయంలో ఉన్నతాధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదన్నారు. చెరువులో అక్రమ నిర్మాణాలకు గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో ప్రజాప్రతినిధులు, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వంలో కొందరు నాయకులు వత్తాసు పలుకుతున్నారనే అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెరువులో వెలసిన అక్రమ నిర్మాణాల అనుమతులను రద్దు చేసి, వాటిని తొలగించి, ఫెన్సింగ్ వేసి ప్రజా ప్రయోజనాలకు ఉపయోగపడేలా చూడాలన్నారు. ఈ ఆందోళనలో బీజేపీ నాయకులు గొల్ల కృష్ణ, అరుణ్‌రావు, ప్రదీప్, ముఖేష్, మురళీకృష్ణ, ఎల్ల స్వామి, కృష్ణ, సంతోష్‌రెడ్డి, సురేష్, బాల కోటేశ్వర్, అంబారెడ్డి, రాఖేష్, పృథ్వీరెడ్డి, తిరుపతిరెడ్డి, కుమార్, రాఖేష్, హరి తదితరులు ఉన్నారు.


ఎర్రకుంట చెరువు వద్ద మాట్లాడుతున్న సతీష్

చెరువులో వెలిసిన నిర్మాణాలు

## చికిత్స పొందుతూ గుర్తు తెలియని వృద్ధుడి మృతి

**రాయదుర్గం, జూలై 28 (ఆంధ్రజ్యోతి):** అనారోగ్యంతో గచ్చిబౌలిలో పడిఉన్న సుమారు 70 సంవత్సరాల వయస్సు ఉన్న గుర్తు తెలియని వృద్ధుడు ఉస్మానియా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో శనివారం రాత్రి మృతి చెందాడు. ఈనెల 25వ తేదీన గచ్చిబౌలిలో స్పృహతప్పి పడిఉన్న వృద్ధుడిని గుర్తించిన గచ్చిబౌలి పోలీసులు చికిత్స కోసం కొండాపూర్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యులు పరీక్షించి మెరుగైన చికిత్స కోసం ఉస్మానియా ఆసుపత్రికి తీసుకెళ్లాల్సిందిగా సూచించారు. దీంతో పోలీసులు ఉస్మానియాకు తరలించారు. అప్పటి నుంచి చికిత్స పొందుతున్న వృద్ధుడు శనివారం రాత్రి 7 గంటల సమయంలో మృతి చెందినట్లు వైద్యులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీలో భద్రపరిచినట్లు గచ్చిబౌలి ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులు తెలిపారు. మృతుడి వివరాల కోసం బస్టాండ్, రైల్వేస్టేషన్, జనసంచార ప్రాంతాలలో వెతికినా ఎలాంటి ఆధారాలు లభించలేదన్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

## చేనేత, వస్త్ర ప్రదర్శనకు విశేష ఆదరణ

**అల్లాపూర్, జూలై 28 (ఆంధ్రజ్యోతి):** మోతీనగర్ కమ్యూనిటీహాల్‌లో శనివారం ప్రారంభమైన కళాసిల్క్స్ చేనేత, వస్త్ర, హస్త కళల ప్రదర్శనకు విశేష జనాదరణ లభిస్తోంది. తెలంగాణ సంస్కృతికి అద్దం పట్టే పోచంపల్లి చీరలతో పాటు వివిధ రకాల బెడ్‌షీట్స్, వెస్ట్ బెంగాల్ జుందాన్ని శారీస్, రాజస్థానీ కోటా శారీస్, మంగళగిరి, ఉప్పాడ, చీరాల, వెంకటగిరి, ధర్మవరం, కలంకారీ చేనేత డ్రెస్ మెటీరియల్, లక్నో చికన్ వర్క్ కుర్తీలు, వన్ గ్రామ్ గోల్డ్ ఆభరణాలతో పాటు యువత మెచ్చే చీరలు, ఇతర మెటీరియల్ ప్రదర్శనలో అందుబాటులో ఉంచామని నిర్వాహకులు వికాస్ జైన్ తెలిపారు. ఈ ప్రదర్శన మరికొన్ని రోజుల పాటు ఉదయం 11 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు ఎగ్జిబిషన్ తెరిచి ఉంటుందని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు.


వెస్ట్ బెంగాల్ ప్యూర్ సిల్క్ తేలికపాటి బరువున్న చీరను (40 గ్రాములు) చూపుతున్న స్టాల్ యజమాని

## విద్యుత్ సబ్‌స్టేషన్లలో లోడ్‌కు తగ్గ అదనపు పీటీఆర్‌లు

### రాజేంద్రనగర్ ధర్మసాయి సబ్‌స్టేషన్‌లో 5 ఎంవీఏ పీటీఆర్‌ను చార్జ్ చేసిన అధికారులు

**హైదరాబాద్ సిటీ, జూలై 28 (ఆంధ్రజ్యోతి):** గ్రేటర్ శివారు ప్రాంతాల్లో విద్యుత్ సబ్‌స్టేషన్లలో లోడ్‌కు తగినట్లు అదనపు పీటీఆర్‌లు ఏర్పాటు దిశగా డిస్కం చర్యలు చేపట్టింది. టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫరూకీ ఆదేశాలతో రంగారెడ్డి జోన్‌లో పరిధిలో రాజేంద్రనగర్, సైబర్‌సిటీ సర్కిళ్లలోని సబ్‌స్టేషన్లలో పెరుగుతున్న లోడ్‌కు అనుగుణంగా అదనపు పవర్ ట్రాన్స్‌ఫార్మర్ (పీటీఆర్)ను ఏర్పాటు చేసి చార్జ్‌చేస్తున్నట్లు రంగారెడ్డి జోన్ చీఫ్ ఇంజనీర్ పి.ఆనంద్ ఆదివారం తెలిపారు. ఫీడర్లపై ఓవర్‌లోడ్ పడకుండా, భవిష్యత్ డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని సీఎండీ ఆదేశాలతో చర్యలు తీసుకుంటునట్లు పేర్కొన్నారు. ఆదివారం రాజేంద్రనగర్ సర్కిల్‌లోని ధర్మసాయి సబ్‌స్టేషన్‌లో అదనంగా ఏర్పాటు చేసిన 5 ఎంవీఏ సామర్థ్యం కలిగిన పవర్‌ట్రాన్స్‌ఫార్మర్‌ను ఇంజనీర్లు, సిబ్బంది చార్జ్ చేశారు.


ధర్మసాయి సబ్‌స్టేషన్లలో 5 ఎంవీఏ పీటీఆర్‌ను చార్జ్ చేసిన అధికారులు

**• నివాళి**


ఉమ్మడి ఏపీ మాజీ ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానందరెడ్డి జయంతి సందర్భంగా కేబీఆర్ పార్క్ వద్దగల ఆయన విగ్రహానికి అభిమానులు, నాయకులు ఆదివారం ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో శేరిలింగంపల్లి మాజీ కౌన్సిలర్ రామస్వామియాదవ్, శ్రీనివాస్, సాయి, సాగర్ పాల్గొన్నారు. -గచ్చిబౌలి,ఆంధ్రజ్యోతి

## మూడు ఫామ్‌హౌస్‌లపై ఎక్సైజ్ పోలీసుల దాడులు

**హైదరాబాద్ సిటీ, జూలై 28(ఆంధ్రజ్యోతి):** అనుమతుల్లేకుండా మద్యం వినియోగిస్తున్న వారిపై ఎక్సైజ్ శాఖ అధికారులు కొరఢా ఝుళిపిస్తున్నారు. అనుమతులు లేకుండా మద్యం వినియోగంతో పాటు నాన్ డ్యూటీ పెయిడ్‌లిక్కర్‌ను వినియోగిస్తుండడంపై ముమ్మరంగా దాడులు నిర్వహిస్తున్నారు. శనివారం రాత్రి నగర శివారుల్లోని రెండు ఫామ్‌హౌస్‌లపై దాడి చేసిన అధికారులు.. అనుమతుల్లేకుండా మద్యం వినియోగిస్తున్న నిర్వాహకులపై కేసులు నమోదు చేసి మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. శంషాబాద్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ పరిధిలో చేవెళ్ల ప్రాంతంలోని తొమ్మిది ఫామ్‌హౌస్‌లను తనిఖీలు చేశారు. రెండు ప్లామ్‌హౌస్‌ల్లో అనుమతి లేకుండా మద్యం వినియోగిస్తున్నట్లు గుర్తించారు. అత్తాపూర్‌లోని మెగా ఫామ్‌హౌస్, సురంగల్‌లోని ఎస్‌ఎంఆర్ ఫామ్‌హౌస్‌లో ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి లిక్కర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ కృష్ణప్రియ తెలిపారు. 48 బీర్లు, 14 ఫుల్ బాటిళ్ల మద్యం పట్టుకున్నారు. పట్టుబడ్డ మద్యం తెలంగాణకు సంబంధించినది కాకపోవడంతో ఎన్‌డీపీఎల్ నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్‌గా గుర్తించినట్లు తెలిపారు. ఎన్నిసార్లు హెచ్చరించినా వినకుండా ఫామ్‌హౌస్‌ల్లో అనుమతిలేని మద్యం వినియోగిస్తున్నారని, ఇలాంటి కేసుల్లో ఫ్లామ్‌హౌస్ యజమానులతోపాటు, మద్యం వినియోగించిన వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు.


ఫామ్‌హౌస్‌ల్లో మద్యాన్ని స్వాధీనం చేసుకున్న ఎక్సైజ్ పోలీసులు

**• మేడిపల్లిలో మరో కేసు**

మేడిపల్లి పరిధిలో ఉన్న సావి సెరెంట్‌లీ అనే ఫామ్‌హౌస్‌లో శనివారం రాత్రి ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ టీమ్ దాడులు నిర్వహించినట్లు అసిస్టెంట్ కమిషనర్ కిషన్ తెలిపారు. ఈ కేసులో 2.25 లీటర్ల డిఫెన్స్ మద్యం, 3.85 లీటర్ల ఐఎంఎల్ (అనుమతి లేని) మద్యం, 6.68 లీటర్ల బీరును స్వాధీనం చేసుకొని ఒకరిపై కేసు నమోదు చేశారు. రంగారెడ్డి జిల్లాలో చేవేళ్ల పరిధిలో ఫామ్‌హౌస్‌లు అధికంగా ఉన్నాయి. అనుమతిలేని మద్యాన్ని ముందుగా అనుమతించవద్దని అసిస్టెంట్ కమిషనర్ తెలిపారు. ఈ ఫామ్‌హౌస్‌ల యజమానులు నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్‌ను అనుమతించకూడదన్నారు.

ఆంధ్రజ్యోతి
ఆంధ్రజ్యోతి ద్వారా జన్మదిన, వివాహ, షష్టిపూర్తి, పదవీ విరమణ, వ్యాపార, ఉద్యోగ, లీగల్ నోటీసులు, బహిరంగ ప్రకటనలు మరియు ఏ ఇతర ప్రకటనలైనా సంప్రదించండి
హరిబాబు : 99854 11086, పున్నారావు: 9985921366